క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, కమిషనర్ వికాస్ మర్మత్ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. కార్పొరేషన్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రంగనాయకులపేట సెక్టార్ పరిధిలోని కపాడిపాళెంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడారు. గర్భిణులు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు శైలజ, విజయకుమారి, సుబ్బరత్నమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ ఆస్పత్రికి విరాళం



నెల్లూరు(బారకాసు): పొదలకూరు రోడ్డులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేన్సర్ ఆస్పత్రికి రూ.రెండు లక్షల విరాళాన్ని శమంత్ మంగళవారం అందజేశారు. తన తండ్రి డాక్టర్ రామచంద్రారెడ్డి స్మృత్యర్థం ఈ మొత్తాన్ని హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, జనరల్ మేనేజర్ మస్తానయ్యకు చెక్కు రూపంలో ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని సామూహికంగా మంగళవారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకుడు రఘురామశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ తదితరులు పర్యవేక్షించారు.


గురజాడ జయంతి సభ రేపు

నెల్లూరు(బృందావనం): మహాకవి గురజాడ అప్పారావు జయంతి సభను పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో గురువారం నిర్వహించనున్నామని కన్యాశుల్కం నాటక నిర్వహణ కమిటీ కోశాధికారి కోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి



వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన బైన సురేష్ గేదెలు గ్రామ సమీపంలోని అడవిలో విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. వారం రోజుల క్రితం మేత కోసం వెళ్లిన రెండు గేదెలు తిరిగి ఇంటికి రాకపోవడంతో సురేష్ చుట్టుపక్కల గ్రామాల్లో వెతికించారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా అడవిలో విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి చెంది ఉన్నాయని కొందరు గ్రామస్తులు చెప్పడంతో వెళ్లి పరిశీలించగా, మృతిచెందిన గేదెలు తనవే అని నిర్ధారించుకున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చనిపోయిన రెండు గేదెలు రూ.1.20 లక్షల విలువ ఉంటుందని బాధితుడు వాపోయారు.



రాణాప్రతాప్ సెంటర్‌లో..



శివకేశవులు దేవస్థానం సమీపంలో..



శివాజీ సెంటర్‌లో..



వెంకటేశ్వరపురంలో..



కార్పొరేషన్ కార్యాలయంలో..



జగనన్న భవన్‌లో..



చంద్రమౌళీనగర్‌లో..

జై.. జై.. గణేశా



నరసింహకొండలో..



వేదాయపాళెం సెంటర్‌లో..

• భక్తిశ్రద్ధలతో వినాయక చవితి

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకొన్నారు. నగరంలోని వివిధ ఆలయాల్లో కొలువైన విఘ్నేశ్వరుడికి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మిత్రమండళ్లు, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ మండపాల్లో ప్రతిష్ఠించిన గణపతులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయా మండపాల్లో కొలువైన గణనాథులను భక్తులు విశేషంగా దర్శించుకొని ప్రణమిల్లారు.

➡ గాంధీబొమ్మ సమీపంలోని శివాజీ సెంటర్‌లో గల వరసిద్ధి వినాయక దేవస్థానంలో వినాయక చవితి ఉత్సవాలను విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి, శివాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, పార్టీ నేత కర్నాటి ఆంజనేయ రెడ్డి, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి తదితరులు హాజరయ్యారు. మహాభారత విశ్వరూప సందర్శనాన్ని ప్రతిబింబించేలా గీతాచార్యుడితో కొలువైన గణనాథుడ్ని తాత్కాలికంగా ప్రతిష్ఠించారు. పిట్టి సత్యనాగేశ్వరరావు, నాగరాజురెడ్డి, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, పేటేటి భాస్కర్‌రావు, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

➡ మైపాడు గేట్ సెంటర్ వద్ద అభయహస్త వినాయకుడ్ని మద్దూరు సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, నగిరి చంద్రయ్య, మదన్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ కొండాయపాళెం రోడ్డులోని భవానీ స్కై టవర్స్‌లో మయూర గణపతిని ప్రతిష్ఠించారు. ఉభయకర్తలు కృష్ణగిరి దేశ్‌పాల్‌సింగ్, దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.

➡ క్రాంతినగర్‌లోని శివకేశవులు దేవస్థానం వద్ద గజ గణపతిని ప్రతిష్ఠించారు. కొండా నిరంజన్‌రెడ్డి, మోహిని, అనపల్లి సతీష్‌రెడ్డి, నిషిత దంపతులు పాల్గొన్నారు. దేవస్థానం వద్ద ప్రత్యేకంగా ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేసి శ్రీలక్ష్మీ సమేత శయనవిష్ణుమూర్తిని కొలువుదీర్చారు. దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ దరిశి పెంచలయ్య, మస్తాన్‌రెడ్డి, మునిరాజ్, లోకనాథం తదితరులు పర్యవేక్షించారు.

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. మేయర్ స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ వికాస్ మర్మత్, కార్పొరేటర్ సత్తార్, కో ఆప్షన్ సభ్యురాలు మొబీనా పాల్గొన్నారు.

నెల్లూరు(దర్గామిట్ట): జేమ్స్ గార్డెన్‌లోని జగనన్న భవన్‌లో వినాయకుడి విగ్రహానికి డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత దార్ల వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు గోగుల నాగరాజు, ఇంతియాజ్, హాజీ, గండవరపు ద్వారకానాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద అన్నదానం చేశారు. లక్ష్మీవీధిలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండలో వినాయకుడి సన్నిధి వద్ద పూజలను ఆలయ అర్చకులు చేశారు.



మైపాడు గేట్ సెంటర్‌లో..

వేదగిరి లక్ష్మీనరసింహస్వామికి విశేషాలంకారం



కాపు వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం



గాంధీబొమ్మ సెంటర్‌లో..

ప్రణాళికబద్ధంగా నిమజ్జన ఏర్పాట్లు

నెల్లూరు(బారకాసు): వినాయక చవితి సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలోని నిమజ్జన ఘాట్ వద్ద ఏర్పాట్లను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఘాట్ వద్ద భారీ క్రేన్లు, మరబోట్లు, బ్యారికేడ్లు.. లైటింగ్, సీసీ కెమెరాలు, తదితరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య విభాగ ఆధ్వర్యంలో కార్మికులు, శానిటరి ఇన్‌స్పెక్టర్లను కేటాయించి ఘాట్ ప్రాంగణం నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టనున్నామని వివరించారు.



పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ

నెల్లూరు (టౌన్): తిరుపతిలో శ్రీనివాస సేతు ప్రారంభానికి విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని సీఎం సూచించారని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరుమలలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాశెం సుధీర్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.



భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు

నెల్లూరు(బృందావనం): ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన సమీపంలోని గణేశ్ నిమజ్జన ఘాట్ వద్ద నిమజ్జనోత్సవాలను ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఘాట్ కిటకిటలాడింది. భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పర్యవేక్షించారు. ప్రసాదాల కౌంటర్లను విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి ప్రారంభించారు. కార్పొరేటర్ విజయలక్ష్మి, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదాన్ని అందజేస్తున్న రంగారెడ్డి

నిత్యావసర సరుకుల అందజేత

నెల్లూరు రూరల్: ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకొని ఇంటికే పరిమితమైన కొత్తూరు పరిధిలోని రామకోటయ్యనగర్‌కు చెందిన శోభకు రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. కనమర్లపూడి లావణ్య జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమె మరిది నారాయణ సహకారంతో బాధితురాలికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే నేత జయప్రకాష్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, సుబ్బారావు, నూర్జహాన్ బేగం, శేషయ్య, కొండాపురం వెంకటేశ్వర్లు, రాఘవేంద్రశేఖర్, సుబహాన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎమ్మెఫ్ జిల్లా కన్వీనర్‌గా మల్లికార్జున్

నెల్లూరు(మినీబైపాస్): ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎమ్మెఫ్) అడ్‌హాక్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా మల్లికార్జున్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. కన్వీనర్లుగా ప్రసాద్, డేవిడ్, మౌంట్ బాటన్, శ్రీహరి, రఫీ ఎన్నికయ్యారని చెప్పారు. పూర్తి కమిటీని త్వరలో ప్రకటించనున్నామని పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ స్నాచింగ్

నెల్లూరు(క్రైమ్): వాటర్ ప్లాంట్‌లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని గొలుసును గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని ఎఫ్‌సీఐ కాలనీలో నివాసం ఉంటున్న నరసమ్మ పిల్లలు సమీపంలో వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారు. పిల్లలు అందుబాటులో లేని సమయంలో ప్లాంట్‌ను ఆమె పర్యవేక్షిస్తారు. ఈ క్రమంలో అక్కడ సోమవారం ఆమె ఉండగా, ఇద్దరు గుర్తుతెలియని యువకులు రెక్కీవేశారు. నీళ్లు కావాలంటూ కొద్దిసేపు ఆమెతో మాట్లాడి వెళ్లిపోయారు. వాటర్ ప్లాంట్‌లోకి రాత్రి 8.30 ప్రాంతంలో దుండగులు ప్రవేశించి ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లేందుకు యత్నించారు. ప్రతిఘటించిన ఆమె గొలుసును గట్టిగా పట్టుకున్నారు. దుండగులు గట్టిగా లాగడంతో గొలుసు రెండుగా తెగింది. దుండగులు తమ చేతికొచ్చిన ఒకటిన్నర సవరతో అక్కడి నుంచి ఉడాయించారు. అనంతరం నవాబుపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నియామక పత్రం అందజేత

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలో వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తూ తాళ్లూరి కుమారమ్మ మృతి చెందడంతో ఆమె కుమారుడు జాన్సన్‌బాబుకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించారు. కార్పొరేషన్ హెల్త్ విభాగంలో క్లీనర్‌గా బాధ్యతలు కల్పిస్తూ నియామక ఉత్తర్వులను కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వీఆర్వో కాకుటూరు శ్రీహరి పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని పడారుపల్లిలోని గంగమ్మ ఆలయంలో గణనాథుడి మట్టి ప్రతిమలను సోమవారం అందజేశారు. శివయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి క్రీడా జట్ల ఎంపికలు

నెల్లూరు (టౌన్): నగర నియోజకవర్గ పరిధిలో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కూల్ గేమ్స్ అండర్ – 14, 17 బాలబాలికల జట్లను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం నుంచి ఎంపిక చేయనున్నామని ఎంఈఓ తిరుపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర నియోజకవర్గంలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు అర్హులని చెప్పారు. అండర్ – 14 విభాగంలో 2010 జనవరి ఒకటి.. 17 ఏళ్ల విభాగంలో 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు గురువారం.. ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా పోటీలు శుక్రవారం.. అథ్లెటిక్స్ జట్లను శనివారం ఎంపిక చేయనున్నామని వివరించారు. హాజరయ్యే వారు అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 94418 04551 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.